
నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, బుధవారం 21 ఆగస్టు 2024 | HANUMAKONDA



దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో ర్యాలీగా వస్తున్న రైతులు

# కదంతొక్కిన రైతన్న

అన్నదాతలు ఆగ్రహించారు. ఇచ్చిన హామీ ప్రకారం పంట రుణాలు మాఫీ చేయకపోవడంపై కాంగ్రెస్ సర్కారుపై దుమ్మెత్తిపోశారు. మంగళవారం ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. సహకార బ్యాంకులు, సొసైటీల వద్దకు వందలాదిగా చేరుకొని ధర్నాకు దిగారు. ఎవరూ స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని మండిపడ్డారు. పలుచోట్ల రైతుల ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపి.. రాస్తారోకోలో పాల్గొన్నారు. దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో నిర్వహించిన భారీ ర్యాలీలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని రైతులకు న్యాయం జరిగేవరకూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

- నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 20

అంతటా రాస్తారోకోలు, ధర్నాలు
- సహకార సంఘాల వద్ద నిరసనలు
- రైతులకు మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్
- సింగరాజుపల్లిలో భారీ ర్యాలీ, పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి
- మిన్నంటిన సీఎం రేవంత్ డౌన్ డౌన్ నినాదాలు
- జనగామ కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాల ధర్నా

## రుణమాఫీ కోసం అన్నదాతల రణం



కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

### న్యాయం జరిగేదాకా అండగా ఉంటాం..

- రైతు గోసపుచ్చుకుంటున్న రేవంత్‌రెడ్డి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- సింగరాజుపల్లిలో రైతుల భారీ ర్యాలీ

దేవరుప్పుల, ఆగస్టు 20 : రుణమాఫీ కోసం రైతులు కదం తొక్కారు. మాఫీ కాని వందలాది మంది రైతులు బీఆర్ఎస్ రైతు విభాగం పిలుపు మేరకు దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలోని ఏపీజీవీబీ వరకు భారీ ర్యాలీగా చేరుకొని బ్యాంకు వద్ద ధర్నా చేశారు. మండల నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, తీగల దయాకర్, బస్వ మల్లేశ్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరగగా మాజీ మంత్రి ఎర్రబెల్లి హాజరై రైతులకు తాము అండగా ఉంటామని, పూర్తి రుణమాఫీ అయ్యే వరకు పోరాడుదామని చెప్పారు. బ్యాంకులో రుణం తీసుకున్న ప్రతి రైతుకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని, కుటుంబంలో అందరికీ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు వద్ద మూడు గంటల పాటు ధర్నా కొనసాగగా సీఎం డౌన్ డౌన్.. రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలతో హోరెత్తాయి. రుణమాఫీ కాని రైతులు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఖరిపై దుయ్యబట్టారు. రేవంత్ మాయమాటలు విని ఓటేశామని, తీరా ఏ ఒక్కటీ అమలు కాకపోవడంతో మోసపోయామని చెప్పారు. రూ.2లక్షల వరకే రుణమాఫీ జరుగుతుందని, మిగితా డబ్బు చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందని బెదిరించడంతో పుస్తెలు అమ్మి కడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులందరికీ రుణమాఫీ జరిగేదాకా బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని మంత్రి ఎర్రబెల్లి భరోసా ఇచ్చారు. పోరాడితేనే ప్రభుత్వం దిగొస్తుందని, రుణమాఫీ చేయాల్సిన రైతుల లిస్ట్ ప్రభుత్వం వద్ద ఉందని, చేతగానితనం వల్ల మాఫీ చేయడం లేదన్నారు. ఎన్నో వాయిదాలు పెట్టిన రేవంత్ ప్రభుత్వం.. బీఆర్ఎస్ ఒత్తిడి వల్లే కొంతైనా రుణమాఫీ చేసిందన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కీలకంగా వ్యవహరించడంతోనే ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. ఇంతటితో వదిలేది లేదని, ప్రతి రైతులకు రుణమాఫీ జరిగేదాకా రైతుల వెంటే ఉంటామని స్పష్టంచేశారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌తో, జిల్లా కలెక్టర్‌తో ఎర్రబెల్లి మాట్లాడి రైతుల పరిస్థితిని వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారి రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్, కొత్త జలంధర్‌రెడ్డి, చింత రవి, రాంసింగ్, కొల్లూరు సోమన్న, ఇంటి మల్లారెడ్డి, కత్తుల సోమిరెడ్డి మహేశ్, రఫేల్‌రెడ్డి, ఇంటి సంజీవ రెడ్డి. మేడ రాంచందర్, ఎల్లప్ప, కోతి ప్రవీణ్, గడ్డం రాజు, గోపాల్‌దాస్ మల్లేశ్, మైదం జోగేశ్, వంగ అర్జున్, కుతాటి నర్సింహా రెడ్డి, గిరి, నల్ల ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకేనా?

నేను దంతాలపల్లి మండలంలోని యూనియన్ బ్యాంక్‌లో రూ. లక్షా 60 వేలు లోన్ తీసుకున్న. అందరి పేర్లు వస్తుంటే నాకు కూడా లోన్ మాఫీ అవుతుందని సంబురపడ్డ. తీరా నీ పేరు రాలేదని చెప్పడంతో బాధగా ఉంది. నా కుటుంబంలో నేను తప్ప ఎవరూ ఏ బ్యాంకులో లోను తీసుకోలేదు. కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు లోన్ మాఫీ చేయలేదా? అర్థం కావడం లేదు.

– ఊదరి అర్వపల్లి, రైతు, పడమటిగూడెం





పాలకుర్తి రూరల్: రుణమాఫీ చేయాలంటూ ఏడీఏకు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

### రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్
- జనగామ కలెక్టరేట్ ఎదుట ధర్నా

జనగామ, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు 2014 నుంచి 2023 వరకున్న రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేసి వెంటనే కొత్త రుణాలివ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం జనగామ సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి పెద్దఎత్తున ధర్నా నిర్వహించింది. జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఆందోళనలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మోకు కనకారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందునాయక్ మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు బోనస్ ఇవ్వాలని, రైతు భరోసా విడుదల చేయాలన్నారు. చిన్న చిన్న సాకులు చూపుతూ రైతులకు రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని ధ్వజమెత్తారు. క్లస్టర్లు, గ్రామాల వారీగా ఎంతమందికి రుణమాఫీ కాలేదో తెలుసుకునేందుకు కలెక్టర్ గ్రామసభలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లాలో 2022 మార్చి, ఏప్రిల్ మాసాల్లో కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలకు పంట నష్టపోయిన రైతులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం జారీచేసిన జీవో ప్రకారం రూ.10 వేలు విడుదల చేయాలని రైతుసంఘం డిమాండ్ చేసింది. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మంగ వీరయ్య, సహాయ కార్యదర్శి రమావత్ మీట్యా నాయక్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు రమేశ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు తోటి దేవదానం, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మీరా సురేశ్‌నాయక్, సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కాసాని పుల్లయ్య, రైతులు కర్రె రాములు, కర్రె బీరయ్య, వెంకటేశ్, రాజ్‌కుమార్, అపరాదపు రాజు పాల్గొన్నారు.



పాలకుర్తిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

### షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

పాలకుర్తి రూరల్, ఆగస్టు 20 : అర్హులైన రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని తాజా మాజీ ఎంపీపీ నల్లానాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల ఆశోక్‌రెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పాలకుర్తిలోని రాజీవ్ చౌరస్తాలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేశారు. రైతులకు రుణమాఫీ చేయని రేవంత్‌రెడ్డి సీఎం పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రూ.31వేల కోట్ల రుణమాఫీ చేస్తానని ప్రకటించిన ప్రభుత్వం 17వేల కోట్లే రుణమాఫీ చేసిందని మండిపడ్డారు. రైతులందరికీ రుణమాఫీ అయ్యే వరకు ప్రభుత్వంపై పోరాడుతామన్నారు.

అనంతరం ఏడీఏ పరశురామ్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, బ్యాంక్ వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, మండల ఉపాధ్యక్షుడు పాము శ్రీనివాస్, ధరావత్ యాకూబ్ నాయక్, కడుదుల కర్ణాకర్‌రెడ్డి, గుగ్గిళ్ల యాకయ్య, తాడేం రవి, పోశాల వెంకన్న, పుస్కూరి కళింగరావు, ఎండీ నాసర్, నకీర్త యాకయ్య, రంగినేని సత్యనారాయణరావు, నక్క నాగయ్య, గోపి, గర్వందుల మల్లేశ్, లకావత్ వెంకట్, నాగరాజు, కమ్మగాని వెంకటేశ్ పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు

### గవిచర్లలో రాస్తారోకో

సంగెం, ఆగస్టు 20 : రుణమాఫీ కాలేదని కాపులకనపర్తి సొసైటీ పరిధిలోని రైతులు మంగళవారం సంగెం మండలం గవిచర్లలోని వరంగల్– నెక్కొండ ప్రధానరోడ్డులో రాస్తారోకో చేశారు. సొసైటీలో 1907 మంది రుణాలు తీసుకుంటే మూడు విడతల్లో ఏ ఒక్కరికీ మాఫీ కాలేదని నిరసన తెలిపారు. అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా ఏకమై రోడ్డెక్కి ప్రభుత్వానికి, అధికారులకు, పాలకమండలికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంగెం మండలంలోని వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణమాస్తే వర్తిస్తే కాపులకనపర్తి, చింతలపల్లి సొసైటీల్లో తీసుకున్న ఏ రైతుకూ మాఫీ వర్తించకపోవటం అన్యాయమని మండిపడ్డారు. తక్షణమే రుణమాఫీ చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



నర్సింహులపేట రైతు వేదిక వద్ద ధర్నా చేస్తున్న రైతులు



వర్ధన్నపేట ఎస్‌బీఐ వద్ద రైతుల బారులు

### రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలి

- రుణమాఫీ పూర్తి కాలేదని మీ మంత్రులే అంటున్నారు
- రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ మంత్రి ధరంసోత్ రెడ్యానాయక్



మాజీ మంత్రి ధరంసోత్ రెడ్యానాయక్

నర్సింహులపేట, ఆగస్టు 20: 'సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లా వైరా సభలో ఆగస్టు 15న రుణమాఫీ చేశామని గొప్పలు చెబుతూ మాజీ మంత్రి హరీశ్‌రావును ముక్కు నేలకు రాయాలన్నారు. అసలు రుణమాఫీ పూర్తి కాలేదని మీ మంత్రులే కదా చెబుతున్నారు. అప్పుడు ముఖ్యమంత్రే ముక్కునేలకు రాయాలి' అని మాజీ మంత్రి ధరంసోత్ రెడ్యానాయక్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడం సరి కాదన్నారు. మొత్తం రుణ మాఫీ రూ. 39 వేల కోట్లన్నరు.. ఆ తర్వాత 31 వేల కోట్లన్నరు? తీరా బడ్జెట్లో రూ. 26 వేల కోట్లు పెట్టారు. అసలు ఇప్పుడు మూడు విడుతలుగా రుణమాఫీ చేసింది రూ. 17 వేల 933 కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు. రైతులను మోసం చేసి ఓట్లు వేయించుకుని సీట్లో కూర్చొని ఈ రోజు రైతులతో చెలగాటం ఆడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని ఎవరూ నమ్మరని అన్నారు. మీకు చిత్తశుద్ధి ఉంటే 2018 డిసెంబర్ నుంచి 9 డిసెంబర్ 2023 వరకు ఎంత ఉంటే అంత మాఫీ చేయాలన్నారు. రుణమాఫీ పేరుతో రైతుబంధు నిలిపివేశారనిచ దీనిని రైతులు గమనిస్తున్నారన్నారు. 6 గ్యారెంటీల్లో మహిళలకు రూ. 2500, కల్యాణలక్ష్మీ పథకంలో తులం బంగారం ఎవరికిచ్చారో చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

### నాకు అర్హత ఉన్నా రుణమాఫీ జరగలేదు



నేను కొండాపురం కెనరా బ్యాంకులో రూ.2లక్షలు పంట రుణం తీసుకున్న. ప్రతీ యేడు మిత్తి కడుతూ రుణాన్ని రెన్యువల్ చేయించుకుంటాన. మూడో దశలో ప్రభుత్వం చేసిన రుణమాఫీ జాబితాలో నా పేరు ఉంటదని సంబురపడ్డ. నేను శనివారం వ్యవసాయశాఖ అధికారిని కలిసి అడిగితే నీ పంట రుణమాఫీ కాలేదని చెప్పాడు. బ్యాంకుకు పోయి అడిగితే సరైన సమాధానం చెప్తలేరు. నేను కేవలం రూ.2లక్షలు మాత్రమే రుణం తీసుకున్న. నాకు రేషన్‌కార్డు, పట్టా పాస్‌పుస్తకం ఉన్నాయి. వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారులు దాటవేసే విధంగా సమాధానాలు ఇస్తున్నరు. నేను ఎవరికి చెప్పుకోవాల్నో అర్థమైతలేదు. సీఎం రూ.2లక్షల రుణమాఫీ చేసినమని చెప్పిండు కానీ నాకెందుకు కాలేదో తెలుస్తలేదు. అన్నీ బోగస్ మాటలే.

– కారుపోతుల రాములు, రైతు, గట్టికల్లు

### ఎప్పుడు మాఫీ అయితదో చెప్పడం లేదు..



ఉప్పల్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రెండు లక్షల క్రాప్‌లోన్ తీసుకున్నా. మిత్తి రూ.2,291ఉన్నందుకు మాఫీ రాలేదని అధికారులు అంటున్నరు. ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేసినమని గొప్పలు చెప్పుతున్నది. రెండు లక్షల రుణం తీసుకున్న రైతులకు మిత్తి అంటగట్టి మాఫీ వర్తించకుండా చేసింది. ఆన్‌లైన్ జాబితాలో ప్రాసెస్‌లో ఉంది. మిత్తి డబ్బులు చెల్లిస్తే రెండు లక్షలోపు ఉంటుంది. అప్పుడు మాఫీ వర్తిస్తుందని వ్యవసాధికారులు చెప్పుతున్నరు.

– మండ భాస్కర్, రైతు, భీంపల్లి, కమలాపూర్

### మా సమస్యకు పరిష్కారమెప్పుడు?

పెద్దవంగర రైతువేదికలో అధికారులపై రైతుల ఆగ్రహం



పెద్దవంగరలోని రైతు వేదికలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రుణమాఫీ కాని రైతులు

పెద్దవంగర, ఆగస్టు 20 : రుణమాఫీ కాక, జాబితాలో తమ పేర్లు లేక, సమాచారం చెప్పేవారు లేక తలలు పట్టుకుంటున్నారు. ఈక్రమంలో తమ సమస్యను చెప్పుకొనేందుకు రోజూ అవుతాపురం, పెద్దవంగర, చిట్యాలలోని రైతు వేదికలకు వచ్చి వెళ్తున్నారు. కానీ అవుతాపురం, చిట్యాల క్లస్టర్లలో ఏవోలు బదిలీ అయిన విషయం తెలియక ఆయా క్లస్టర్లలోని రైతులు వాటి చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా తమకు రుణమాఫీ ఎప్పుడు అవుతుందో స్పష్టంగా చెప్పాలంటూ పలువురు రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు.



ధర్నా చేస్తున్న రైతులు

### షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ఏటూరునాగారం, ఆగస్టు20 : షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని పలువురు రైతులు ఏటూరునాగారం రైతు వేదిక వద్ద వారు బుధవారం ధర్నా చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఓ వైపు సాగు పనులు మొదలై పెట్టుబడులకు రైతులు పడుతున్న ఇబ్బందులు గుర్తించి వెంటనే మాఫీ ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని కోరారు. ధర్నాలో రైతులు వడకపురం సారయ్య, లాల్‌బీ, మోకాళ్ళ భాస్కర్, కాచర్ల నారాయణ, సిద్దబోయిన రాంబాబు, మధారి చంద్రమౌళి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

- మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో పర్యటన
- కొడవటంచలో రూ. 12.15 కోట్ల పనులు ప్రారంభం
- రెండో యాదాద్రిగా తీర్చిదిద్దుతామని వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రేగొండ/కృష్ణకాలనీ/గణపురం/వెంకటాపూర్/గోవిందరావుపేట, ఆగస్టు 20 : జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని, ఇందుకోసం అవసరమైన నిధులను కేటాయిస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, భూపాలపల్లి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు గండ్ర సత్యానారాయణరావు, నాగరాజు, వరంగల్ ఎంపీ కడియం కావ్యతో కలిసి జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా రేగొండ మండలం కొడవటంచలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ. 12.15 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. రెండో యాదాద్రిగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. అనంతరం తిరుమలగిరి శివారులోని వెంకటేశ్వరస్వామి, ప్రాచీన చరిత్ర కలిగిన పాండవుల గుట్టలను పరిశీలించారు. గణపురం మండలం మైలారంలోని సున్నపు గుహలు, గణపసముద్రం చెరువు కట్ట, కోట, రెడ్డి గుళ్లను సందర్శించారు. కోటగుళ్లలో మొక్కలు నాటారు. అనంతరం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆ పిదప ఆలయ అభివృద్ధిపై కేంద్ర పురావస్తు శాఖ అధికారులతో చర్చించారు. రామప్ప ఆలయం అద్భుతంగా ఉందని కొనియాడారు. అక్కడి నుంచి గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సుకు చేరుకున్నారు. ఉయ్యాల వంతెన మీదుగా ఐలాండ్‌కు చేరుకొని మంత్రులు, అధికారులతో కలిసి సరస్సులో బోటు షికారు చేశారు. ఉడెన్ కాటేజీలను పరిశీలించి పర్యాటకులకు కల్పిస్తున్న వసతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యాటక పరంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ముందుంటుందని అన్నారు. మంత్రుల వెంట పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్, ఎండీ ప్రకాశ్‌రెడ్డి, భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు రాహుల్ శర్మ, దివాకర, ములుగు ఎస్పీ శబరీశ్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ములుగు ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇదేం పోలీసింగ్?

- హద్దులు దాటుతున్న అభిమానం
- రౌడీషీటర్స్‌తో కలిసి ఖాకీల సంబురాలు
- మంత్రి బర్త్‌డే వేడుకల్లో ఓవరాక్షన్‌పై స్పందించిన సీపీ
- వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్‌కు షోకాజ్ నోటీసు జారీ
- 'నమస్తే' కథనంతో విచారణకు ఆదేశం

సుబేదారి, ఆగస్టు 20 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో కొందరు అధికారులు 'అభిమానం' ముసుగులో హద్దులు దాటుతున్న తీరు విస్తుగొల్పుతున్నది. కొందరు పోలీసుల ప్రవర్తన ఆ శాఖకే మచ్చ తీసుకొస్తున్నది. సోమవారం కాశీబుగ్గలో మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు వేడుకల్లో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఇంతెజార్ గంజ్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, మల్లయ్యతో పాటు సిబ్బంది వ్యవహార శైలి రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. వారి ఆదేశాల మేరకు వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా ఏసీపీకి మంగళవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఐదు రోజుల్లో జవాబు చెప్పాలని సీపీ ఆ నోటీసులో పేర్కొన్నట్లు తెలిసింది. సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమాను విచారణ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సీపీని 'నమస్తే' ఫోన్‌లో వివరణ కోరగా, ఏసీపీకి నోటీసు ఇచ్చామని, సెంట్రల్ జోన్ డీసీపీ విచారణ చేస్తున్నారని, పోలీసు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**రౌడీషీటర్స్‌తో సంబురాలా?**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఏసీపీ మొదలు ఎస్సైల వరకు సర్వీస్ రూల్స్‌ను పక్కన పెట్టి పోస్టింగ్ ఇప్పించిన అభిమానంతో అతిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో సోమవారం మంత్రి సురేఖ పుట్టిన రోజు వేడుకల్లో నడిరోడ్డుపై ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు రూల్స్‌కు విరుద్ధంగా యూనిఫాంలో పాల్గొనడం, ఆమె అనుచరులు, నేర స్వభావం ఉన్న వ్యక్తులతో కలిసి సంబురాలు చేసుకోవడం, కేక్ కట్ చేసి, బిర్యానీ ప్యాకెట్లు, చీరలు పంపిణీ చేయడం, రోడ్డును బ్లాక్ చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ప్రవరించడాన్ని నగరవాసులు చీదరించుకుంటున్నారు. పోలీసు అధికారుల తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారు. పోలీసులే హద్దు మీరి ప్రవర్తిస్తే ఇక చట్టాన్ని రక్షించేది ఎవరంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ వేడుకల్లో నలుగురికి గాయాలు కావడంపై అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరిస్తే ఉక్కుపాదం మోపుతామని ప్రభుత్వ పెద్దలు, పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ కొందరి తీరు మారడం లేదని, పోలీసింగ్ అంటే ఇదేనా అని సీనియర్ అధికారులు మదన పడుతున్నారు.